సాక్షి 24/7
హైదరాబాద్ 28-07-2013
Page No:13

# సునామీ ఇలా వస్తుందా..!





ఇంకాయిస్‌లో సునామీ హెచ్చరిక కేంద్రం చేసే పనులను ఆసక్తిగా ఆలకిస్తున్న విద్యార్థులు

నవశక్తినగర్, న్యూస్‌లైన్: మహా నగర విద్యార్థులు మహాసముద్రపు కెరటాలతో ఊసులాడారు. సముద్ర జలాల్లో ఈదులాడే చేపలతో దోస్తీ కట్టారు. ఇదేమిటి రాజధానిలో సముద్రమేమిటి అనుకుంటున్నారా? కాని అక్కడెక్కడో మహాసముద్రపు అలల కదలికల్ని స్క్రీన్‌పై వీక్షించి నేరుగా తాకిన అనుభూతిని కలిగించింది ప్రగతినగర్‌లోని భారత జాతీయ మహా సముద్రయాన సమాచార సేవా సంస్థ (ఇంకాయిస్). మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ వ్యవస్థాపక దినం సందర్భంగా విద్యార్థులకు 'ఓపెన్ డే' పేరిట ఇక్కడి విజ్ఞాన విశేషాలను వివరించారు. నగర వ్యాప్తంగా పది పాఠశాలలకు చెందిన దాదాపు 800 మంది విద్యార్థులు శనివారం ఇంకాయిస్‌ను సందర్శించారు. ఇక్కడి సునామీ హెచ్చరికల కేంద్రం పనితీరు, సునామీ రాకను ముందుగానే పసిగట్టి ప్రభుత్వాలను అప్రమత్తం చేయడం, తద్వారా నష్టాన్ని తగ్గించడం వంటి అంశాలపై ఇంకాయిస్ ఏవిధంగా సమర్థవంతంగా నిర్వహిస్తుందో ఆ సంస్థ ప్రతినిధులు ఉమాదేవి, పతంజలి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఎప్పటికప్పుడు మారుతున్న అలల స్థితిగతులను ఇక్కడి స్క్రీన్ ద్వారా విద్యార్థులకు చూపించారు. అలల దిశ, వాటి స్వభావం, భూ ఉపరితల స్థితిని కె.శ్రీనివాస్, డాక్టర్ హరికుమార్, రమ్య, కవి వివరించారు. సముద్ర జలాల్లో తిరుగాడే చేపల్ని విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. చేపలు ఏ ప్రాంతంలో ఎక్కువగా దొరుకుతాయో ఇంకాయిస్ గుర్తించి మత్స్యకారులకు సమాచారం చేరవేసే విధానాన్ని ప్రీతి వివరించిన తీరు విద్యార్థుల్ని ఆకట్టుకుంది. సముద్రంలో ప్రయాణం చేసే షిప్ కదలికలు క్షణం క్షణం లైవ్‌లో కనపడటం అబ్బురపరిచింది. ఇంకాయిస్ సమాచారం విశ్లేషణ చేసే హైపవర్ కంప్యూటర్స్ వివరాలను విద్యార్థులు తెలుసుకున్నారు. సముద్రంలో ఉష్ణోగ్రత, ప్రెషర్ వంటి వాటిని ఎప్పటికప్పుడు గుర్తించే ఆధునిక పరికరాలు, శాటిలైట్ ద్వారా తాజా సమాచారం అందే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. గైడింగ్ వాలంటీర్స్‌గా వివేకానందన్, హేమసుందర్‌లు వ్యవహరించారు.

## గర్వకారణం...



హైదరాబాద్‌లో మహాసముద్రాల సమాచారాన్ని అందించే సంస్థ ఒకటి ఉందని ఇప్పుడే తెలుసుకున్నా. ఇక్కడ జరిగే ప్రతి విషయం నిజంగా అద్భుతం. మహాసముద్రంలో జరిగే ప్రతి కదలికను పసిగట్టడం, సునామీ రాకను ముందుగానే గుర్తించడం వంటి పరిజ్ఞానం మన దగ్గర ఉండడం గర్వకారణం. - సాక్షిత

## కొత్త విషయాలు తెలిశాయి...



మహాసముద్రాల గురించి ఎన్నో విలువైన విశేషాలు తెలిశాయి. ముఖ్యంగా సముద్రంలో చేపలు ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని గుర్తించి మత్స్యకారులకు అండగా నిలబడి వారికి ఉపాధి కల్పించడం బాగుంది. - మనస్విత

## అద్భుతం...



సునామీ రాకను ముందుగానే పసిగట్టగలిగే పరిజ్ఞానం బాగుంది. సునామీ వచ్చే ముందు మహాసముద్రంలో అలలు ఏవిధంగా కదులుతాయి? భూ ఉపరితల ప్లేట్‌లో ఏ విధమైన మార్పులు చోటుచేసుకుంటాయి? అనే విలువైన సమాచారం తెలిసింది. - ప్రవల్లిక